లారీలో రైలు బోగి..

లారీపై తరలిస్తున్న రైలు బోగీ

ఇచ్చోడ, మే 30 : ఇచ్చోడ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై.. ఓ లారీపై రైలు బోగీ ఎక్కింది. ఈ దృశ్యం చూపరులను కనువిందు చేసింది. తమిళనాడులోని పెరంబదూర్ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వైపు గురువారం ఉదయం ఓ లారీలో రైలు బోగీలను తరలించారు. ఈ క్రమంలో మండలంలోని గాంధీనగర్ వద్ద ప్రయాణికులు ఈ దృశ్యాన్ని తమ ఫోన్‌లో బంధించారు.

సిరికొండలో తాగునీటి కష్టాలు

ఒకే చేతి పంపు వద్ద నీళ్ల నింపుతున్న గ్రామస్తులు

ఇచ్చోడ, మే 30 : సిరికొండ మండలం పోచంపల్లి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన లక్ష్మీపూర్(కే)లో తాగునీటి సమస్య నెలకొన్నది. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో గిరిజనులకు తాగునీటి అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం, గ్రామం మొత్తానికి ఒకే చేతి పంపు ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఉన్న ఒక్క చేతి పంపు వద్ద వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మంచినీటి వసతిని కల్పించాలని కోరారు.

మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం

నార్నూర్ నర్సరీలో ఎండిపోతున్న మొక్కలు

నార్నూర్, మే 30 : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టింది. నిర్దేశించిన లక్ష్యం మేర మొక్కలు పెంచుతున్నది. ఎండ తీవ్రత నుంచి వాటి సంరక్షణకు గ్రీన్‌మ్యాట్లను కూడా ఏర్పాటు చేసింది. కానీ, నార్నూర్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం పక్కన గల నర్సరీపై పర్యవేక్షణ లోపించింది. మొక్కలకు సరిగా నీరు పోయకపోవడంతో వాడిపోయి, ఎండిపోతున్నాయి. ఇక్కడ 10వేల రకాల మొక్కలు పెంచుతున్నారు. మండల పరిషత్ శాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో కొరవడిందని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు ఉండే కార్యాలయం పక్కన ఉన్న నర్సరీ నిర్వహణే ఇలా ఉంటే.. మారుమూల గ్రామ పంచాయతీల పరిధిలో ఎలా ఉంటుందోనని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మండలశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి, నర్సరీల నిర్వహణపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా

ఇసుక తవ్వేందుకు ఉంచిన పనిముట్లను సీజ్ చేసిన పోలీసులు

జైనథ్, మే 30 : మండలంలోని పెన్‌గంగ సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా పెట్టినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. బహదూర్ పెన్‌గంగ వద్ద గురువారం ఇసుక తవ్వేందుకు ఉంచిన పని ముట్లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వాల్టా చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినా, డంప్ చేసినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ అధికారి రమేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

జైనథ్, మే 30 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని మండలాభివృద్ధి అధికారి రవీంద్రనాథ్ అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కొనసాగుతుందన్నారు. అందులో భాగంగానే బడి ఈడు, బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు వీవో లీడర్లు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్యాం సుందర్, ఏపీఎం భగవాండ్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వీవో లీడర్లు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సంబురాలు

సారంగాపూర్, మే 30 : బీడీ కార్మికుల వేతనాల పెరుగుదలపై మండలంలోని చించోలి(బీ) ఎక్స్ రోడ్డు సమీపంలో ఉన్న శివాజీ ఫ్యాక్టరీ వద్ద గురువారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియర్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించి, స్వీట్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ.. వేతనాల పెరుగుదల కార్మికుల కృషి ఫలితంగా జరిగిందన్నారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధినిచ్చే బీడీ పరిశ్రమ రోజు రోజుకూ నిర్వీర్యమైపోతున్నదని, కార్మికులను ప్రభుత్వాలే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమలో జీవనభృతి రాని కార్మికులకు, ప్రభుత్వం ఇచ్చిన ఇచ్చిన హామీ ప్రకారం జీవనభృతి ఆంక్షలు లేకుండా ఇవ్వాలని కోరారు. లేకపోతే ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రామలక్ష్మణ్ బంతి, నాయకులు లక్ష్మి, గంగామణి, రాజేందర్, రవి, వెంకట్, లక్ష్మణరవి, కమల, కవిత పాల్గొన్నారు.

కొత్త బోర్లకు భూమిపూజ

గుడిహత్నూర్, మే 30 : గుడిహత్నూర్ మండలం సోమార్‌పేట్‌లో నీటి ఎద్దడి కారణంగా రెండు కొత్త బోర్లు మంజూరయ్యాయి. గురువారం జడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ భూమిపూజ చేసి, ప్రారంభించారు. కొన్ని రోజుల క్రితం ఆ పల్లెను జడ్పీటీసీ విజిట్ చేయగా, గ్రామస్తులు నీటి ఎద్దడి ఉందని, బోర్లు వేయించాలని కోరారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జలీం, గణేశ్ పటేల్, కుమార్ కేంద్రె, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ, స్మగ్లింగ్‌కు పాల్పడితే చర్యలు

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- డిస్ట్రిక్ట్ లెవెల్ ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, చిత్రంలో ఎస్పీ గౌష్ ఆలం, డీఎఫ్‌వో ప్రశాంత్‌పాటిల్

ఎదులాపురం, మే 30 : అటవీ భూమిని ఆక్రమించినా, స్మగ్లింగ్‌కు పాల్పడినా చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం డీఎఫ్‌వో ప్రశాంత్‌పాటిల్(ఐఎఫ్ఎస్), ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి డిస్ట్రిక్ట్ లెవెల్ ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్‌అండ్‌బీ ఈఈ, విద్యుత్‌శాఖ ఈఈ, ఆటవీశాఖ జిల్లా ఫారెస్ట్ అధికారులు, డివిజన్ ఆఫీసర్లు, రెంజ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్మగ్లింగ్‌కు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఎస్పీకు ఆదేశాలు ఇచ్చామన్నారు. పంట చేనుల చూట్టూ విద్యుత్ తీగలు అమర్చవద్దని, ఈ విషయన్ని గమనించాలని తెలిపారు. రోడ్డుకు, ఇతర అవసరాలకు అటవీ భూమి అవసరమైతే ఎఫ్‌సీఏలో దరఖాస్తు చేసుకొని పర్మిషన్ తీసుకున్నాకే పనులు చేపట్టాలన్నారు. వ్యవసయ భూములు, ఇంటి పరిసర ప్రాంతంలో, రోడ్డుపై కరెంట్ తీగల కింద చెట్లు నరికితే వాల్టాయాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

4.16లక్షల ఎకరాల్లో పత్తి సాగు..

జిల్లాలో 4.16 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయనున్నారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అందుకు సుమారు 10 లక్షల 40వేల విత్తన పాకెట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 511 షాపులలో జిల్లాకు విత్తనాలు 10,38,435 విత్తన ప్యాకెట్లు ఉన్నాయని, అందులో 3,40,005 విక్రయించినట్లు వెల్లడించారు. 6,98,430 బ్యాలెన్స్ ఉన్నాయని వెల్లడించారు. 55 కంపెనీలకు సంబంధించిన 128 హైబ్రిడ్ రకాలు (ప్రభుత్వం ఆమోదం పొందిన) మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాశీ షీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ 5 రకాలు, రాశిమ్యాజిక్, రాశి 659, రాశిషిఫ్ట్, రాశి 797 ప్రైమ్ అందుబాటులో ఉన్నాయన్నారు. గతేడాది రాశీసీడ్స్ 5 రకల విత్తనాలు 2,53,212 పాకెట్లు అమ్మినట్లు, ఈ ఏడాది 2,80,000 వేల పాకెటుల ప్రణాళిక చేసినట్లు, అందులో 1,40,000 పాకెట్లు అమ్మినట్లు వివరించారు. మిగతావి జూన్ 2 నుంచి మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలోని అన్ని చెక్‌పోస్టులు బస్టాండ్, రైల్వేస్టేషన్లలో బందోబస్తుతో పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విత్తన డీలర్లు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మరాదని, నకిలీ విత్తనాలు అమ్మేవారిపై నిఘా ఉంచాలని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. జూన్10వ తేదీ వరకు ప్రతి రోజూ నాలుగైదు దుకాణాల్లో తనిఖీ చేస్తూ, రైతులకు సక్రమంగా విత్తనాలు అందేలా చూడాలన్నారు. అనంతరం ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. అన్ని చెక్‌పోస్టుల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి, తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్రకు విత్తనాలు సరఫరా కాకుండా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విత్తన షాపులు ఉదయం 7 గంటలకు తెరిచి ఉంచాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, ఏడీఏ, ఆర్టీసీ డీఎం, డీఏవో, విత్తన కంపెనీలు డీలర్లు ఉన్నారు.

3 నుంచి 'బడిబాట'

బడిబాట కార్యక్రమం 3 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బడిబాట కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆవాసాల్లో బడీడు పిల్లలందరినీ గుర్తించి, సమీప పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదును పెంచి, నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో ప్రణీత, డీఆర్డీవో సాయన్న, సంక్షేమ శాఖఅధికారులు, అధికారులు పాల్గొన్నారు.

'బడిబాట' విజయవంతం చేయాలి

నార్నూర్ : మాట్లాడుతున్న ఎంఈవో రాపెల్లి ఆశన్న

నార్నూర్, మే 30 : బడిబాట కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు ఎంపీడీవో జవహర్‌లాల్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండలశాఖ అధికారులతో పాటు పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశాలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జూన్ 3వ దీన ప్రతి పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించి, విద్యార్థుల ప్రవేశాలను పెంచాలన్నారు. యూనిఫాంల వివరాలను ఐకేపీ ఏపీఎం రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సాయంతో పాఠశాలలో భౌతిక వసతులను మెరుగుపర్చి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కమిటీ సభ్యుల సాయం తీసుకోవాలన్నారు. తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంఈవో రాపెల్లి ఆశన్న, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సోన్‌లో సమావేశం..

సోన్, మే 30 : సోన్ మండల కేంద్రంలో నిర్వహించే బడిబాట కార్యక్రమంపై శుక్రవారం సోన్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలస్థాయి అధికారులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్లు పాల్గొనాలని కోరారు.

ఇచ్చోడలో 1న సమావేశం..

ఇచ్చోడ, మే 30 : ఇచ్చోడ తహసీల్ కార్యాయలంలో జూన్ 1వ తేదీన బడిబాట కార్యక్రమం అకాడమిక్ ఇయర్-2024 సందర్భంగా హెచ్ఎంలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఉదయ్‌రావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీఈవో, ఏఈపీఆర్, మండలాధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఏహెచ్ఎస్, టీడబ్ల్యూపీఎస్, జడ్పీఎస్ఎస్, ఎంపీయూపీఎస్, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు, వీవోలు, ఎస్సీ, బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (వార్డెన్) ప్రధానోపాధ్యాయులు తమ వీవోలతోపాటు తప్పని సరిగా హాజరుకావాలని సూచించారు. మన ఊరు-మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాల, యూనిఫామ్స్, ఎన్‌టీ బుక్స్ విద్యార్థుల సంఖ్య, ఎండీఎం వివరాలతో రావాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని

- సీఎం రేవంత్‌ను కోరిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే శంకర్



సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఎదులాపురం, మే 30 : చెనాక-కోర్ట నిర్వాసితులకు పరిహారం, ఆదిలాబాద్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో కలిసి వినతి పత్రం అందించారు. ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు వెంటనే రూ.94 కోట్ల పరిహారం ఇవ్వాలన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదలకాకపోవడంతో పనులకు నిలించిపోయాయని, భూ సేకరణ కింద ప్రభుత్వం బాధితులకు రూ.27 కోట్ల చెల్లించాలని పేర్కొన్నారు. జిల్లాలో రైతులకు అవసరమయ్యే విత్తనాలను పంపిణీ చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గ సమస్యలను సీఎంకు విన్నవించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు

దస్తురాబాద్, మే 30 : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. దస్తురాబాద్ మండలంలోని మల్లాపూర్, బుట్టాపూర్, చెన్నూర్, రేవోజిపేట, గొడిసేర్యాల గోండు గూడెం, గొడిసేర్యాల, మున్యాల, మున్యాల గోండుగూడెం, ఎర్రగుంట, దస్తురాబాద్, భూత్కుర్, మున్యాల తండా తదితర గ్రా మాల్లో గురువారం ప్రజాప్రతినిధులు, నా యకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కాగా, బుట్టాపూర్‌లోని శ్రీ హన్‌మాన్ ఆలయంలో నిర్వహిస్తున్న రామ యాజ్ఞంలో పా ల్గొని పూజలు చేశారు. గ్రామాల వారీగా ప్ర జలతో సమావేశమై, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నీటి, రోడ్డు, విద్యుత్, డ్రైనేజీ, డీఆర్డీవో భవనాల సమస్యలను దశల వారీ గా పరిష్కరిస్తామన్నారు. అంతకుముందు పలు గ్రామాల్లో పలువురు బాధితులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఎంపీపీ సింగరి కిషన్, ఎంపీటీసీ వెడ్మ మాన్కు, మండలాధ్యక్షుడు బొడ్డు మల్లేశ్, యూత్ అధ్యక్షుడు గుండా నరేశ్, నాయకులు రమేశ్ రావ్, శరత్ రెడ్డి, పుల్యా నాయక్, శ్రీనివాస్, స్వామి, వెంకన్న, సురేందర్, రాజమల్లయ్య, కిరణ్, బిల్ సింగ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

ఎదులాపురం, మే 30 : బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని సఖీ కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఒయాసిస్ కంప్యూటర్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గురువారం సఖి కేంద్రం పని తీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. సఖి కేంద్రం ద్వారా ఐదు రకల సేవలు అందిస్తున్నామని తెలిపారు. న్యాయ, కౌన్సెలింగ్, పోలీస్, వైద్య సేవలు, తాత్కాలిక వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాలు, గృహహింస, ఫోక్సో చట్టం, సైబర్ క్రైమ్ తదితర చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అత్యవసర సమయంలో 181, 100, 1098, 1930కు కాల్ చేయాలని సూచించారు.

అవగాహన కల్పిస్తున్న సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య

దవాఖానల్లో కొనసాగుతున్న తనిఖీ

ప్రైవేటు దవాఖానల వైద్యులతో మాట్లాడుతున్న సాధన

ఎదులాపురం, మే 30 : ఆదిలాబాద్ పట్టణంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే గురువారం పట్టణంలోని భుక్తాపూర్‌లో గల ప్రైవేటు దవాఖానలను తనిఖీ చేశారు. పీసీపీఎన్‌డీటీ(ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్) చట్టం ప్రకారం అన్ని నిబంధనలు అమలు చేయాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన హెచ్చరించారు. ఈ మేరకు దవాఖాన సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. తనిఖీలో ఐడీఎస్‌పీ అధికారి డాక్టర్ అశోక్, మాస్ మీడియా అధికారి వెంకట్ రెడ్డి, కార్యాలయ అధికారి రాంప్రసాద్ ఉన్నారు.

పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మెస్రం వంశీయులు

కొత్త కోడళ్ల భేటీలో ప్రత్యేక పూజలు

తాంసి(తలమడుగు), మే 30 : లక్ష్మీపూర్ పరిధి మల్కుపల్లి గ్రామంలో నాలుగు రోజులుగా నిడి గొండడ్కుర్ మెస్రం వంశీయులు వారి మెస్రం కోడళ్లను భేటీ కార్యక్రమం చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా 260 జంటలు, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి 96 గ్రామాల మెస్రం వంశీయులు మొక్కులు చెల్లించుకున్నారని పెర్సపేన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మెస్రం సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో కటోడ మెస్రం శంకర్, పేన్ పటేల్ మెస్రం మారు, గ్రామ పటేల్ మెస్రం భీంరావ్, మహాజన్, వేర్కడ్ జ్యోతిరాం, మాజీ సర్పంచ్ రాధ మనోహర్ తొడసం పాల్గొన్నారు.

విత్తనాల జాగ్రత్తలు పాటించాలి

బోథ్, మే 30 : రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ విస్తరణాధికారి కే శ్యాం సూచించారు. మండలంలోని కరత్వాడలో గురువారం అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని, డీలర్ల వద్ద కొనుగోలు చేసిన విత్తనాల రసీదులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

జైనథ్, మే 30 : రైతులు పత్తి పంటలో విత్తనాలు ఎంపిక చేసుకునే సమయంలో ఒకే రకంపై పూర్తిగా ఆధారపడకుండా అన్ని రకాల కంపెనీలకు సంబంధించినవి విత్తుకోవాలని, నష్టపోయే ప్రమాదం తగ్గుతుందని మండల ఏవో వివేక్ అన్నారు. మండలంలోని నీరాల గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాకు అవసరమైన 10 లక్షల విత్తన ప్యాకెట్లకు గాను 10,40,000 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆందోళనకు అవసరం లేదని రైతులకు సూచించారు. ఏఈవో సుజాత, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి గాయాలు

భీంపూర్, మే 30 : భీంపూర్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రైతు విభాగం నాయకుడు గురువారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బైక్‌పై ఆదిలాబాద్ వైపు వస్తుండగా, సావర్గాం వద్ద అదుపు తప్పి మోరం తవ్వకాల గుంతల్లో పడిపోయాడు. హెల్మెట్ ధరించి ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. స్వల్ప గాయాలైన ఆయన, ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ఆయనను నాయకులు కపిల్, జీ నరేందర్ తదితరులు పరామర్శించారు.

సద్వినియోగం చేసుకోండి

నిర్మల్ అర్బన్, మే 30 : నిర్మల్ సర్కిల్ ప్రజావాణి సమావేశాలను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 12వ తేదీన ప్రజావాణి సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని, ప్రతీ బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. సర్కిల్‌స్థాయి సమావేశాలకు ఎస్ఈ, డివిజన్ స్థాయి సమావేశాలకు డీఈ అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఇచ్చోడ, మే 30 : మండలంలోని మల్లేశ్‌పేట గ్రామ శివారులో గురువారం తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. ముఖం కుళ్లిపోయి ఉన్నదని, బ్లూ కలర్ షర్ట్, గ్రే కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఇతనికి సుమారు 50 ఏండ్లు ఉంటాయని, తెలిసినవారు 87126 59944 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖానాపూర్ రూరల్, మే 30 : ఖానాపూర్ మండలం బాదనకర్తి గ్రామంలో గురువారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీ కొని ఒక్కరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఖానాపూర్ ఏస్ఐ లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. నువ్వుల రణధీర్ బైక్‌పై పెట్రోల్ కోసం బంక్‌కు వెళ్లి, తిరిగి వచ్చే క్రమంలో రోడ్డు దాటుతుండగా, ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. అక్కడే పడిపోవడంతో గాయాలయ్యాయి. ఉన్నత వైద్యం కోసం నిర్మల్ దవాఖానకు తరలించారు. రణధీర్ అన్న రణవీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగింపునకు ధాన్యం కొనుగోళ్లు

ఉట్నూర్ రూరల్, మే 30 : మండలంలో వరి ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకున్నాయి. ఉట్నూర్, బిర్సాయిపేట్ గ్రామాల్లో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు 100 మంది రైతులు సుమారుగా 4 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించారు. వారం క్రితం వర్షాలు కురవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందారు.

బాధిత కుటుంబానికి చేయూత

లక్ష్మణచాంద, మే 30 : వడ్యాలలో తలారి శ్రీనివాస్ ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోగా, జడ్పీఎస్ఎస్ పాఠశాల తోటి విద్యార్థులు (2000-01 బ్యాచ్) ఆర్థిక సాయం అందించారు. అందరూ విరాళంగా జమచేసిన రూ.30 వేలను బాధిత కుటుంబానికి అందించి, తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావం

నిర్మల్ అర్బన్, మే 30 : సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్మల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి సురేశ్, కోశాధికారి లలిత సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా కార్మికుల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎదులాపురం, మే 30 : సీఐటీయూ ఆవిర్భావ వేడుకలను జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులకు కార్మికులకు పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, నాయకులు పండుగ పొచ్చన్న, తోకల శ్రీకాంత్, సిరిగిరి దశాంత్, దర్శనాల నగేశ్, మంజుల, సుజాత, రమాకాంత్, రాంజీ, సత్యనారాయణ తదితరులున్నారు.

భీంపూర్, మే 30 : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని భీంపూర్‌లో పార్టీ జెండా ఆవిష్కరించారు. అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, ప్రతినిధులు సుజాత, ప్రియ, స్వామి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వెల్గటూర్, మే 30: బైక్‌ను వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ బస్‌స్టేజీ వద్ద బుధవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఇంద్రవెల్లికి చెందిన బావునే దత్త(26) అదే గ్రామానికి చెందిన బింబి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి యాజమాని బింబి కొడుకు కోటేశ్‌ను కరీంనగర్ వెళ్లేందుకు ఊట్నూర్‌లో బస్సు ఎక్కించాడు. అంతలోనే